క్లుప్తంగా

వైభవంగా ఉరుసు



ఫాతేహాలు నిర్వహిస్తున్న భక్తులు

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులో వెలసిన హజరత్ సయ్యద్ షా మహ్మద్ జలాలుద్దీన్ ఖాద్రి రహంతుల్లాలై ఉరుసు అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం స్వామివారి ఉరుసు సందర్భంగా దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు, చదివింపులు నిర్వహించారు. ఉరుసు నిర్వాహకులు, దర్గా పీఠాధిపతి ఖలీల్‌సాహెబ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్వామివారి గంధం మహోత్సవంలో పెద్ద మసీదు ఇమామ్ సాబ్ సయ్యద్ హబీబులాల సాహెబ్ గంధం తీసుకుని రాగా భక్తిశ్రద్ధలతో పకీర్‌సాబ్‌ల విన్యాసాలతో వందలాది మంది భక్తుల సమక్షంలో వేడుకలు జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు.

ఆకట్టుకున్న దాసవాణి

మంత్రాలయం: శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల చాతుర్మాస దీక్ష సమరూప కార్యక్రమంలో భాగంగా చేపట్టిన దాసవాణి ఆకట్టుకుంది. శ్రీమఠం యోగీంద్ర మండపంలో బెంగళూరుకు చెందిన శ్రీకాంత్ భట్ విద్వాన్‌చే దాసవాణి చేపట్టారు. విభావరిలో విద్వాన్ ఆలపించిన సంకీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దాదాపు 43 రోజుల పాటు శ్రీమఠంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హరికథ పారాయణం, దాస సాహిత్య కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. కార్యక్రమంలో శిష్యసంపర్కాధికారులు వాదిరాజాచార్య, మంచాలి మధ్మనాభ ఆచార్య పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లకు నేడు ఆఖరు

ఆదోని సెంట్రల్: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లకు రిజిష్టర్ చేసుకునేందుకు శనివారంతో గడువు ముగియనుంది. చదవుకోవాలని ఆశ ఉండి అనివార్య కారణాలు, అర్థికపరమైన ఇబ్బందుల వల్ల మధ్యలో బడి మానేసిన వారికి ఇది మంచి అవకాశం. చిరుద్యోగులు, గృహిణులు, మెకానిక్‌లు, టైలర్లు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొనే వారు ఇంటి వద్ద ఉండి చదువుకోవచ్చు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న వారు దగ్గర్లోని మీ సేవా కేంద్రాలలో 10వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్ టీసీ, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌తో పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రిజిష్టర్ కొరకు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. తరగతుల ప్రవేశాలకు జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.1400, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు రూ.1100 చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సంజన్న తెలిపారు.

బీమా తక్షణసాయం అందజేత

మంత్రాలయం: మండల పరిధిలోని చెట్నెహళ్లి గ్రామానికి చెందిన బెస్త పెయింటర్ బాబు శుక్రవారం గుండెపోటుతో మరణించాడు. మృతుడికి వైఎస్సార్ బీమా నమోదై ఉండడంతో తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును సర్పంచ్ అంజిని, ఉపసర్పంచ్ వీరనాగప్ప, గంగులమల్లికార్జున చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగతా నగదు నామినీ బ్యాంకు ఖాతాలో త్వరలోనే జమ అవుతుందని వారు తెలిపారు.

ముమ్మరంగా పైప్‌లైన్ పనులు



పైప్‌లైన్ ఏర్పాటుకు జేసీబీతో గుంత తవ్వుతున్న దృశ్యం

కోసిగి: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కోసిగిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.18 లక్షలతో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పులికనుమ రిజర్వాయర్ నుంచి రంగప్పగట్టు దగ్గర ఏర్పాటు చేసే స్టోరేజీ ట్యాంక్ వరకు తాగునీటిని పంపింగ్ చేసి అక్కడి నుంచి కోసిగిలోని చైతన్య స్కూల్, మార్కండేయ స్వామి, మైనార్టీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీలకు పైప్‌లైన్ ద్వారా తాగునీటి సరఫరా చేయనున్నట్లు సర్పంచ్ అయ్యమ్మ తెలిపారు. పైప్‌లైన్ పనులు పూర్తి చేసి త్వరలోనే నీటిని సరఫరా చేస్తామన్నారు.

కొనసాగుతున్న పికెట్

ఆదోనిరూరల్: మండలంలోని అలసందగుత్తి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరిచిన విషయం విధితమే. గ్రామంలో ప్రశాంతత నెలకొల్పేందుకు పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్న పీరయ్య ఆధ్వర్యంలో చేపట్టిన పికెట్ శుక్రవారం ఐదోరోజూ కొనసాగింది. గ్రామంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

17 మంది అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని అలసందగుత్తిలో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడి చేసిన కేసులో 17 మందిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి విలేకరులకు తెలిపారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయిలైన సోమలింగ, లక్ష్మన్నతో పాటు మరో 15 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణకే 'జగనన్న సురక్ష'



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



ధణాపురంలో మహిళకు ఆరోగ్య పరీక్ష చేస్తున్న దృశ్యం



వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎం

ఆదోని సెంట్రల్: ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే వైద్య రంగంలో ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్ర స్థాయిలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందించే దిశగా కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీన వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. 16వ తేదీ నుంచి ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటి సర్వే చేపట్టి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలను గుర్తించారు. వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేశారు. ఆరోగ్య సమస్యలున్న వారు ప్రభుత్వం నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలకు వచ్చి చికిత్స పొందాలని సూచిస్తూ టోకెన్లు అందించారు.

నేటి నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. ఆదోని డివిజన్‌లో 27 ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తారు. అందులో ఆదోని, మంత్రాలయం నియోజకవర్గంలో 5 వైద్య శిబిరాలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి వైద్య శిబిరంలో ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లతో పాటు ఇద్దరు స్పెషలిష్ట్ డాక్టర్లు ఉంటారు. వీరితో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్ ఆఫీసర్లు ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొంటారు. ఎవరికైనా అత్యవసర వైద్యం అవసరం అనిపిస్తే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపిస్తారు. ఇలా పరీక్షించిన ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేసి స్థానికంగా ఉండే సీహెచ్‌ఓలు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు వారి ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ ఆరోగ్య పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటారు.

నేటి వైద్య శిబిరాల షెడ్యూల్

- ఆదోని మండలం ఇస్వి గ్రామ పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ షేక్ ఇమ్రాన్ అహ్మద్ పర్యవేక్షణలో వైద్య శిబిరం
- కోసిగిలోని ఆది ఆంధ్ర పాఠశాల ఆవరణలో డాక్టర్ మనోజ్ కుమార్ పర్యవేక్షణలో వైద్య శిబిరం
- కౌతాళం గ్రామ సచివాలయంలో డాక్టర్ పావని పర్యవేక్షణలో వైద్య శిబిరం
- మంత్రాలయం మండలం రాంపురం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో డాక్టర్ పి.వసంత పర్యవేక్షణలో వైద్య శిబిరం
- పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామంలో అగ్రికల్చర్ సొసైటి కార్యాలయంలో డాక్టరు సయ్యద్ తెర్‌పాషా ఖాద్రి పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించనున్నారు.

ముగిసిన ఆరోగ్య సర్వే

ఆదోనిటౌన్: దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య సర్వే శుక్రవారంతో ముగిసింది. ఆదోని డివిజన్ పరిధిలోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని ప్రాంతాల్లో సర్వే పూర్తి చేశారు. సర్వేలో భాగంగా మండలంలో 11,390 మంది బీపీ వ్యాధిగ్రస్తులు, 11,230 మందికి షుగర్ పరీక్షలు, 13,872 మందికి రక్త పరీక్షలు, 145 మందికి మలేరియా పరీక్ష, 41 మందికి డెంగ్యూ పరీక్ష, 150 మందికి టీబీ (క్షయ) పరీక్షలు చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి తెలిపారు. అలాగే ఆదోని పట్టణంలోని 42 సచివాలయాల పరిధిలో 16,912 మందికి బీపీ పరీక్షలు, 11,614 మందికి షుగర్ టెస్టులు, 23,886 మందికి రక్త పరీక్షలు, 502 మందికి మలేరియా పరీక్ష, ఐదుగురికి డెంగ్యూ టెస్ట్, 467 మందికి క్షయవ్యాధి పరీక్షలు చేసినట్లు ఆమె వివరించారు. అందరి సహకారంతో సర్వేను విజయవంతం చేశామన్నారు.

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో రోగాలకు చెక్ పెట్టవచ్చని కౌతాళం పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్‌కుమార్, బదినేహల్ పీహెచ్‌సీ వైద్యాధికారి ఇమ్మానియేల్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు చేసి వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. శనివారం నుంచి వైద్య శిబిరాలు ఏర్పా టు చేసి మెరుగైన వైద్య సేవలు అందించనున్నా మని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోసిగి: మండల కేంద్రంలోని కడపాళెం ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మాణిక్యరాజు, హాస్పెటల్ పీహెచ్‌ఎన్ కోటేశ్వరమ్మ కోరారు. శుక్రవారం స్థానిక ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో ఏర్పాట్లను ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్‌తో పర్యవేక్షించారు. కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోసిగయ్య, కురువ మల్లయ్య, రాజేష్, ఏఎన్‌ఎమ్ సుజాత తదితరులు ఉన్నారు.

ఆదోని మండలంలో వైద్య శిబిరాల షెడ్యూల్

ఆదోనిరూరల్: మండలంలో ఎంపీడీఓ, తహసీల్దార్‌లు రెండు బృందాలుగా ఏర్పడి శనివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించన్నట్లు ఎంపీడీఓ గీతావాణి తెలిపారు. ఈ మేరకు కార్యక్రమం షెడ్యూల్ వివరాలను ఆమె వివరించారు. మండలంలోని 35 సచివాలయాల పరిధిలో కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 30న ఇస్వీ, అక్టోబర్ 3న ధణాపురం, 4న దొడ్డనగేరి, 5న నారాయణపురం, 6న సాధాపురం, 7న హానావాల్, 9న మదిరె-2, 10న మాంత్రికి, 11న మండిగిరి-2, 12న నాగలాపురం, 13న సాంబగల్లు, 16న పెద్ద తుంబళం-2, 17న దిబ్బనకల్, 18న బసాపురం, 19న విరుపాపురం, 20న చిన్నపెండేకల్, 21న గణేకల్, 24న ఆరేకల్, 25న సంతెకూడ్లూరు-2, 26న జాలిమంచి, 27న పెద్దహరివాణం-2, 28న బసరకోడు, 30న సంతెకూడ్లూరు-1, నవంబర్ 1న చిన్న హరివాణం, 2న హాసల్లి, 3న కుప్పగల్, 4న మదిరె-1, 6న బైచిగేరి, 10న నాగనాథనహల్లి, 14న మండిగిరి-1, 15న బల్లేకల్, 20న పెసలబండ, 25న కపటి గ్రామాల్లో కార్యక్రమాలు చేపడతామన్నారు. రోగులకు వైద్య సిబ్బంది చేత వైద్య చికిత్సలు చేయించి, ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం




జగనన్న ఆరోగ్య సురక్షలో కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇంటింటి సర్వే పూర్తైన గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మిగతా గ్రామాల్లోనూ సర్వే ముగింపు దశలో ఉంది. ఏ ప్రాంతంలో వైద్య శిబిరాలు నిర్వహించాలో ప్రణాళికలు రుపొందించాం. ప్రజల ఆరోగ్య సమస్యలకు మెరుగైన వైద్యం పొందడానికి ఇది మంచి అవకాశం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టరు సత్యవతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుల నియామకం






భీమా రెడ్డి-మంత్రాలయం, బెట్టన గౌడ-కోసిగి, ప్రహ్లాద-కౌతాళం, రామ్మోహన్ రెడ్డి-పెద్దకడబూరు

మంత్రాలయం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులను నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కమిటీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు మంత్రాలయం నియోజవర్గంలోని మంత్రాలయం మండలాధ్యక్షుడిగా భీమారెడ్డి, కోసిగి మండలాధ్యక్షుడిగా బెట్టన గౌడ, కౌతాళంకు కె.ప్రహ్లాద, పెద్దకడబూరుకు రామ్మోహన్ రెడ్డిలను నియమించారు. ఆయా మండలాల అధ్యక్షుల ఎంపికపై పార్టీ కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ఆదోని మున్సిపాలిటీ, మండలాధ్యక్షుల నియామకం



చంద్రశేఖరయ్య, ఆదోని మున్సిపాలిటీ క్లస్టర్-1



దేవా, ఆదోని మున్సిపాలిటీ క్లస్టర్ -2



విశ్వనాథ్ గౌడ్, ఆదోని మండలం

ఆదోనిటౌన్: వైఎస్సార్ సీపీ ఆదోని మున్సిపాలిటీ, మండల అధ్యక్షులను నియామకం చేపడుతూ పార్టీ అధిష్టానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదోని మున్సిపాలిటీ క్లస్టర్ అధ్యక్షులుగా చంద్రశేఖరయ్య (మమ్మత్తి స్వామి), క్లస్టర్-2 అధ్యక్షుడిగా దేవాను నియమించింది. అలాగే మండలాధ్యక్షుడిగా విశ్వనాథ గౌడను నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

సమస్యలు పరిష్కరించండి



మురుగు నీటితో నిండిన కాలనీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రభాకర్

పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామం సమస్యల వలయంలో కూరుకుపోయింది. ఏడాదికిపైగా గ్రామ సర్పంచ్ బసమ్మ(టీడీపీ) అందుబాటులో లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే అన్నచందంగా మారింది. దీంతో గ్రామస్తులు స్థానిక వైస్ ఎంపీపీ ముత్తమ్మ, గొర్రెల ఫెడరేషన్ సభ్యుడు మాజీ ఎంపీటీసీ యల్లప్పను ఆశ్రయించారు. స్పందించిన వైస్ ఎంపీపీ సమస్యలను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మండల అధికారులతో మాట్లాడి తక్షణమే చిన్నతుంబళం వెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభాకర్ గ్రామానికి చేరుకుని పరిశీలించారు. గ్రామస్తులు మాట్లాడుతూ సర్పంచ్ అందుబాటులో ఉండడం లేదని, కనీసం మీరైనా సమస్యలు పరిష్కరించి ప్రజలు రోగాల భారిన పడకుండా చూడాలని కోరారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి అయప్పరెడ్డిని ఆదేశించారు. త్వరలనే సమస్యలు తీరతాయని ప్రజలకు హామీ ఇచ్చారు.

నేరస్తులను కఠినంగా శిక్షించాలి



రాఘవేంద్ర సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు

ఆదోనిరూరల్: చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలోని కావూరిపల్లె పంచాయతీ వేణుగోపాలపురంలో వడ్డే భవ్యశ్రీ హత్యకు పాల్పడిన నలుగురు నిందితులను కఠినంగా శిక్షించాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదోనిలోని కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు మాట్లాడుతూ మైనర్ బాలికను ఈ నెల 17వ తేదీన నలుగురు కిరాతకులు మానభంగం చేసి చంపేశారన్నారు. హంతకులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఆదోని తాలూకా అధ్యక్షులు మరియాని చెన్నబసప్ప, అధ్యక్షులు వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: చిత్తూరు జిల్లా వేణుగోపాలపురం గ్రామానికి చెందిన భవ్యశ్రీ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వడ్డెర సంఘం గౌరవాధ్యక్షులు వడ్డెనారయణ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి రాఘవేంద్రసర్కిల్ వరకు విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించి మానవ హారంగా ఏర్పడి భవ్యశ్రీ హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ర్యాలీకి జై భీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు జానయ్య మద్దతు తెలిపారు. జై భీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దర్జి హనుమన్న నాయకులు రత్నం తదితరులు ఉన్నారు.

కోసిగి: మైనర్ యువతిని అత్యాచారం చేసి దారుణ హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోసిగి మండల వడ్డెర సంఘం విశ్వనాథ్, నాగరాజు, బసవరాజు, గోపాల్‌లు కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కోసిగి మండల వడ్డెర పంఘం కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపిన డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

ఉరేసుకుని ఆత్మహత్య

తుగ్గలి: మండల పరిధిలోని మారెళ్లకు చెందిన యాపదిన్నె హనుమంతు (60) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..హనుమంతు తనకున్న నాలుగెకరాలతో పాటు మరో 10 ఎకరాలు గుత్తకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వర్షాలు లేక కొన్నేళ్లుగా పంట దిగుబడులు సరిగా చేతికందలేదు. కుటుంబ పోషణ, పంట పెట్టుబడుల కోసం చేసిన అప్పులు వడ్డీలతో కలిపి దాదాపు రూ.10 లక్షలకు చేరాయి. అప్పు ఎలా తీర్చాలన్న బెంగతో మనస్తాపానికి గురై గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తుగ్గలి ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.

దేశ సమైక్యతను కాపాడుకుందాం



ఎరిగేరి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



పవిత్ర మట్టిని సేకరిస్తున్న పాఠశాల సిబ్బందితో ఎంఈఓ శివరాములు



కోసిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలికల పాఠశాల విద్యార్థినులు

ఆదోని సెంట్రల్: దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుకునేందుకు నా భూమి - నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారులు బి.శివరాములు, శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని సెయింట్ ఆంథోని ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ఫాదర్ జాన్ డేవిడ్ అధ్యక్షతన శుక్రవారం కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు మండలాలు, జిల్లాలు, రాష్ట్రాలు దేశమంతా మట్టిని సేకరించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. సేకరించిన మట్టితో న్యూఢిల్లీలో అమృత వాటికను నిర్మించాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే పాఠశాల నలుదిక్కులా పవిత్ర మట్టిని సేకరించారు.అనంతరం విద్యార్థులచే ర్యాలీ చేపట్టారు.ఉపాధ్యాయులు కేశవయ్య, ప్రకాశమ్మ, నరసన్న,భారతి, శాంతి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: అజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు నా భూమి- నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరిదేవి ఆధ్వర్యంలో పాఠశాల నుంచి మహనీయుల చిత్ర పటాలతో పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం, తదితర ప్రాంతాలలో మట్టి సేకరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌతాళం: నా భూమి–నా దేశం కార్యక్రమం మండలంలో శుక్రవారం ఘనంగా జరిగింది. విద్యార్థులతో పాటు అన్ని సామాజిక వర్గాల ప్రజలు పిడికిలి పవిత్ర మట్టిని తీసుకొచ్చి కుండలో పోశారు.కౌతాళంతో పాటు ఎరిగేరి, నదిచాగి తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల గుండా ర్యాలీగా బయలుదేరి మట్టిని సేకరించారు. నదిచాగి గ్రామంలో తొంటరాధ్య మఠం పీఠాధిపతులు సిద్దలింగ మహస్వాముల వారి ఆశీస్సులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురురాజ శెట్టి, కౌతాళంలో ప్రధానోపాధ్యాయులు ఇమ్మాన్యుయేల్, ఎరిగేరి గ్రామంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

హంపికి బయలుదేరిన భక్తులు

ఆలూరు: మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో కొలువుదీరిన శ్రీ ఉచ్చీరప్ప తాత ఉత్సవమూర్తి పల్లకోత్సవం, నందికోలు సేవతో భక్తులు శుక్రవారం ఊరేగింపుగా హంపికి బయలుదేరి వెళ్లారు. గ్రామం నుంచి సుమారు రెండు వేల మందికి పైగా భక్తులు కాలినడకన మర్రి తాత మఠం ఆవరణకు చేరుకోగా బంగ్లా బజారప్ప కుటుంబ సభ్యులు భోజన సౌకర్యం కల్పించారు. అనంతరం ఉచ్చీరప్ప తాతను మేళతాళాలతో గ్రామస్తులు సాగనంపారు. వీరు హాలహర్వి మండలం విరుపాపురం గ్రామం మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని కంప్లీ నుంచి హంపిలో కొలువుదీరిన విరుపాక్షయ్య స్వామి దేవస్థానం ఆవరణలో శుద్ధజలంతో ఉచ్చీరప్ప తాతకు అభిషేకం చేస్తారు. భక్తులు తిరిగి వచ్చే నెల 5వ తేదీన పెద్దహోతూరు గ్రామం చేరకుంటామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

గొర్రెల పెంపకంలో రాణించాలి

దేవనకొండ: గొర్రెల పెంపకందారులు ఉత్తమంగా రాణించి లాభాలు పొందాలని కర్నూలు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ దుర్గాప్రసన్నబాబు, రిసోర్స్ పర్సన్ డాక్టర్ రామసుబ్బారెడ్డి, పశువైద్యాధికారులు వెంకటేశ్వర్లు, జానకి సూచించారు. ఈ మేరకు శుక్రవారం దేవనకొండలోని పశు వైద్యశాలలో గొర్రెల పెంపకందారులకు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. శాస్త్రీయ పద్ధతుల తో గొర్రెలు, మేకల పెంపకంలో లాభాలబాట, సన్నజీవాల పెంపకందారులు మందలోని పొట్టేళ్లను జన్యు సంబంధం లేని వేరే మంద నుంచి తీసుకొచ్చి పెంచినట్లయితే మంచి పిల్లలు పుట్టి జీవాల మరణాలను అరికట్టవచ్చన్నారు. సకాలంలో నట్టల నివారణ మందు వేయించాలని సూచించారు. బ్రీ డింగ్, మేత విధానాలపై అవగాహన కల్పించారు.

గుప్త నిధుల తవ్వకాలపై ఫిర్యాదు

దేవనకొండ: మండలంలోని కరిడికొండ గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 835లో గుప్త నిధుల కోసం కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపారని వీఆర్వో బి.రాజన్న శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు. తవ్వకాలు చేపట్టిన దుండగులు స్థానికులు రావడంతో కరిడికొండ గ్రామ శివారులో ఏపీ 21 బీఎం 9311 నంబరు గల కారును చెట్టు కింద వదిలి వెళ్లిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం




జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం, దవడలకు కడ్డీలు గుచ్చుకుని భక్తిని చాటుతున్న యువతులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో వెలసిన చౌడేశ్వరి దేవి దేవాలయంలో శుక్రవారం జ్యోతి మహోత్సవాల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఊరేగింపులో యువత తమ నాలుక, దవడ, మెడ, చేతులపై కడ్డీలు గుచ్చుకొని భక్తిని చాటుకున్నారు. అలాగే కత్తులతో విన్యాసాలు చేస్తు తమ శరీరం, చేతులపై గాట్లు పెట్టుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆచారంలో భాగంగానే ఇలాంటి విన్యాసాలు చేస్తున్నామని భక్తులు తెలిపారు.

నంద్యాల జిల్లా వృషభాల రాజసం



రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో 6 రోజులుగా జరుగుతున్న శ్రీ మాతా మారెమ్మ బ్రహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన అంతర్ రాష్ట్రస్థాయి సీనియర్ విభాగం వృషభాల బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా, డోన్ మండలం, ధర్మవరం సుబ్బారెడ్డి వృషభాలు నిర్ణీత సమయంలో రాతిదూళాన్ని 3,400 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచాయి. కర్నూలు జిల్లా, పత్తికొండ మండలం, పందికోనకు చెందిన ఉప్పరి సుందరప్ప, నంద్యాల జిల్లా బిల్లాపురం గ్రామం భూమా గోవర్ధన్ రెడ్డి వృషభాలు ఉమ్మడిగా 3,175 అడుగులు, వెల్దుర్తి మండలం, చెరుకులపాడుకు చెందిన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వృషభాలు 2,908 అడుగులు, వైఎస్సార్ జిల్లా, ప్రొద్దుటూరు మండలం, చౌటేపల్లికి చెందిన సర్పంచ్ మార్తాల చంద్ర ఓబుల్ రెడ్డి వృషభాలు 2,863 అడుగులు, ప్రొద్దుటూరు మండలం, కమనూరుకు చెందిన పెద్ద శివకాంత్‌రెడ్డి వృషభాలు 2,822 అడుగుల లాగి తర్వాతి స్థానాల్లో నిలిచాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలను అందజేశారు. బ్రహోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు, పోలీసు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

వైట్‌హౌస్ వీక్షణ మధురానుభూతినిచ్చింది



పర్యటన ముగించుకుని స్వగ్రామానికి చేరిన తర్వాత తల్లితో శివలింగమ్మ

కౌతాళం: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చాటిన పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అరుదైన అవకాశం కల్పించింది. ప్రపంచ దేశాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల కీర్తి చాటాలనే లక్ష్యంతో పది మందిని ఎంపిక చేసి ఐక్యరాజ్య సమితి, వరల్డ్ బ్యాంక్, అమెరికా అధ్యక్ష సౌధం సందర్శనార్థం ఈ నెల 14న అమెరికాకు పంపించింది. వారిలో జిల్లా నుంచి పొదలకుంట గ్రామానికి చెందిన శివలింగమ్మకు అవకాశం దక్కింది. ఆమె పర్యటన ముగించుకుని శుక్రవారం రాత్రి స్వగ్రామానికి చేరుకోవడంతో తల్లిదండ్రులు సోమనాథ్, గంగమ్మలతోపాటు గ్రామస్తులు స్వాగతం పలికారు. విద్యార్థిని శివలింగమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితోనే తమ లాంటి పేద విద్యార్థులకు ఇలాంటి అరుదైన అవకాశం దక్కిందని, అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌ను వీక్షించడంతో మరుపురాని అనుభూతి కలిగిందని పేర్కొంది.